## విద్యార్థులు భవిష్యత్‌కు మార్గాలు వేసుకోవాలి

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 26: విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు ఇప్పటి నుంచే మార్గాలు వేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. నర్సంపేటలోని డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు వేదికగా మారనున్నాయని దొంతి అన్నారు. ప్రస్తుతం కళాశాలలో రూ. 20 లక్షలతో తరగతి గదులు నిర్మించనున్నట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 20 నుంచి 25 కంప్యూటర్లను మంజూరు చేశామన్నారు. అనంతరం డిగ్రీ సెకండియర్ విద్యార్థులు రచించిన ఆంగ్ల పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే, వరంగల్ కిట్స్ కళాశాలలో ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లం నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు వేముల సాంబయ్య గౌడ్, రాజేందర్, అంజలి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మాధవరెడ్డి అన్నారు. నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో గీతాంజలి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శివాని గురుకులంలో నవంబర్ 9, 10వ తేదీల్లో జరగనున్న ఓరుగల్లు బాలోత్సవం-2024 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డైరెక్టర్లు గిరగాని రాహుల్‌వర్మ, శ్రీరాంకిరణ్, ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, రచయిత నెల్లుట్ల సుమన్, తోకల శ్రీనివాసరెడ్డి, కిరణ్‌రెడ్డి, పాల్వాయి రవి పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గీసుగొండ, అక్టోబర్ 26: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కోనాయిమాకులలో శనివారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. దేశంలో వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం రాష్ట్రంలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ దొంగ హామీలు ఇచ్చిన అధికారంలోకి వచ్చాయని విమర్శించారు. రైతాంగానికి పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించే వరకూ ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అంశాల్‌రెడ్డి, నాయకులు వజ్ర రాజు, పేరయ్య, రామరావు, సాంబశివరావు, రాజు, హేమంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

వర్ధన్నపేట, అక్టోబర్ 26: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చెక్కా ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ విజయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఇస్లావత్ కల్యాణ్, అక్షయ, అజీర, అఖిల, రాజు, సాగర్, తనీష్, సంతోష్, చందు, రామ్‌చరణ్, రత్నాకర్, నాగరాజు, అనుదీప్ పాల్గొన్నారు.

## గ్రేటర్ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి బదిలీ

వరంగల్, అక్టోబర్ 26 : గ్రేటర్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డిని బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ కమిషనర్ జోనాను నియమించారు. రాజేందర్‌రెడ్డిని సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన జూలైలో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చారు.

**బహిరంగ ప్రకటన**

తేది.26-10-2024 శనివారం రోజున, ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన శ్రీరామోజ్ ప్రవీన్, తండ్రి కీ.శే. కుమారస్వామి, వృత్తి వ్యాపారం, నివాసం: ఇ.నెం. 3-5-15, సుధానగర్, హనుమకొండ జిల్లా గారికి మోతే వెంకటలక్ష్మి, భర్త: వెంకటయ్య, నివాసం: ఇ.నెం. 3-7-299, కుమార్‌పల్లి, హనుమకొండ జిల్లా గారు స్వాధీనంలో ఉన్న ఆస్తిని వారి కుటుంబ అవసరాల నిమిత్తం అమ్మదల్చుకున్నారు. నా క్లయింట్ కొనదల్చుకున్నాడు. నా యొక్క క్లయింట్ కొనడానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇట్టి ఆస్తికి బయానాగా ఇచ్చినారు. మిగితా డబ్బులు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చిన రోజున ఇస్తానని ఒప్పుకోవడం జరిగింది. సదరు మోతే వెంకటలక్ష్మి గారు ఇట్టి ఆస్తిని సేల్ డీడ్ నెం.156/1985, తేది.15-01-1985, ఎస్.ఆర్.ఓ., వరంగల్ (ఆర్.ఓ.) ద్వారా సంక్రమించినది. సదరు ఆస్తిపై ఎలాంటి తాకట్టులు, జప్తులు, రుణ భారములు లేవని నా క్లయింటును నమ్మించినారు. కావున ఈ ప్రకటన ద్వారా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవ్వరికైన ఏమైన అభ్యంతరములు, తనఖాలు, ఆక్షేపణలు, దావాలు ఉన్నచో వారం రోజులలో ఈ దిగువ అడ్వకేట్ అడ్రసుకు లిఖితపూర్వకంగా తెలియజేయగలరు. లేనిచో ఇట్టి ఆస్తిపై ఎటువంటి అభ్యంతరములు లేవని భావించవలసివచ్చును. పై గడువు తరువాత వచ్చు అభ్యంతరములు పరిగణలోకి తీసుకొనబడవు.

**షెడ్యూలు ఆస్తి:** హనుమకొండ పట్టణ పరిధిలోని కుమార్‌పల్లి ఇ.నెం. 3-7-299 (కొత్తది), ఇ.నెం. 3-7-109, 3/553 (పాతవి) రెండు అంతస్తుల భవనం హనుమకొండ మున్సిపల్ పరిధిలోని విస్తీర్ణం: 142 చ.గ.లకు దీనికి హద్దులు, తూర్పు; పబ్బ చంద్రమౌళి గారి (2.6) దారి, పడమర: 30 ఫీట్ల రోడ్డు, ఉత్తరం; పబ్బ చంద్రమౌళి గారి ఇల్లు, దక్షిణం: 20 ఫీట్ల రోడ్డు, ఈ ప్రకటన శ్రీరామోజ్ ప్రవీన్. తండ్రి: కీ.శే. కుమారస్వామి గారి సూచనతో ఇవ్వనైనది.

ఇట్లు **చౌడవరపు రాము** B.Com.,LL.M
న్యాయవాది, 2-6-286, హౌజింగ్ బోర్డు కాలనీ, హనుమకొండ జిల్లా, సెల్: 9440708371.

## డయాగ్నొస్టిక్ సెంటర్ల సీజ్

ఖిలావరంగల్, అక్టోబర్ 26: శివనగర్ లోని హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్, ఫోర్ట్ వరంగల్‌లోని త్రివేణి డయాగ్నొస్టిక్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని గుర్తించి సీజ్ చేశారు. అలాగే, ఆర్ఎంపీ క్లినిక్‌ను కూడా సీజ్ చేశారు. అయితే, సీజ్ చేసిన క్లినిక్ పేరును అధికారులు బయట పెట్టలేదు.

## వృద్ధురాలి మృతి

నెక్కొండ, అక్టోబర్ 26: స్పృహ కోల్పోయి కిందపడిపోయిన వృద్ధురాలు మృతి చెందిన ఘటన నెక్కొండలో శనివారం జరిగింది. గూడూరు మండలం గుండెంగ శివారు గుగులోత్‌తండాకు చెందిన వృద్ధురాలు జునా మండలకేంద్రంలోని అండర్‌బ్రిడ్జి సమీపంలో స్పృహతప్పి కిందపడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వచ్చి మృతదేహాన్ని తండాకు తరలించారు.

# మానవతా దృక్పథంతో పరిష్కరించాలి

- కలెక్టర్ సత్య శారద
- ప్రత్యేక ప్రజావాణికి 8 దరఖాస్తులు
- వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందించిన దివ్యాంగులు

కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఖిలావరంగల్, అక్టోబర్ 26: దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు అందాయి. రెండు నెలలుగా మీసేవ సెంటర్లలో సదరం స్లాట్ బుకింగ్‌లో సర్వర్ సమస్య ఉందని, అర్హులు ఇబ్బంది పడుతున్నారని నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీం, అంబటి రాజేందర్, బండి చక్రపాణి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లలో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. అలాగే, దివ్యాంగుల కోసం జిల్లాకో భవనం నిర్మించాలన్నారు. మామునూరుకు చెందిన దివ్యాంగురాలు పీ భాగ్యలక్ష్మి తనకు అంత్యోదయ కార్డు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం ప్రకారం అధికారులందరికీ చట్టంపై అవగాహన కల్పించాలని వయోవృద్ధుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు కే మల్లారెడ్డి కలెక్టర్‌ను కోరారు. బ్యాటరీ త్రీవీల్ సైకిల్ ఇప్పించాలని వర్ధన్నపేట మండలం నల్ల బెల్లికి చెందిన బీ కుమారస్వామి దరఖాస్తు చేసుకున్నాడు. నెలనెలా అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నానని, నిల్వ నీడలేని తనకు డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయించాలని కాశీబుగ్గకు చెందిన దివ్యాంగుడు బొర్లపాటి రాజేశ్ దరఖాస్తు చేకున్నాడు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీడబ్ల్యూవో రాజమణి పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు**

కలెక్టర్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కలిశారు. ఈ నెల 25న పత్తి కొనుగోలులో జరిగిన పరిణామాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాల కారణంగా పత్తిలో తేమ 15 నుంచి 25 పెరిగిందని, సీసీఐ 12 శాతం తేమతోనే కొనుగోలు చేసే నిబంధనలు ఉన్నాయని, దీనిపై రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కేంద్ర జౌళిశాఖ మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అయితే, కొంతమంది స్వార్థపరులు రైతుల్లో వ్యాపారులపై అపోహలు సృష్టించి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, ఓంకారేశ్వర్, మల్లారెడ్డి, వేణుగోపాల్, మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.

**ముగ్గురు దొంగల అరెస్టు**

ఖిలావరంగల్, అక్టోబర్ 26: రైల్వేస్టేషన్‌లో ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా పెద్దతండా పరిధి జలగంనగర్‌కు చెందిన గద్దల రామకృష్ణ(38), బానోత్ సాయికుమార్(26), దుబ్బాకుల కిశోర్(20) వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా, అందులో 8 మొబైళ్లు లభించాయి. వీటిని ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య వివిధ రైళ్లలో ప్రయాణికుల వద్ద చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

**పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్**

గిర్మాజీపేట, అక్టోబర్ 26: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన సబిల్‌కు నగరానికి చెందిన అమ్మాయితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో చనువు పెంచుకున్న సబిల్ అమ్మాయిపై లైంగిక దాడికి యత్నించగా, తల్లిదండ్రులకు తెలిపింది. వారు ఈ నెల 4న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

**11 తులాల బంగారు ఆభరణాలు చోరీ**

దేశాయిపేట 80 ఫీట్లరోడ్‌లో నివాసముంటున్న షబానా భర్త దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నివసిస్తున్నది. ఈ నెల 14న సాయంత్రం 4.30 గంటలకు కూరగాయలు కొనుగోలు కోసం షబానా మార్కెట్‌కు వెళ్లి గంట వ్యవధిలోనే ఇంటికి తిరిగి వచ్చింది. ఈ క్రమంలో అనుమాతంతో బీరువాను తెరిచి చూడగా 11 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. తమ బంధువులపై అనుమానం ఉన్నట్లు శనివారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షుకూర్ తెలిపారు.

**నూతన ఏజెన్సీ ఏర్పాటు**

సంగెం, అక్టోబర్ 26: కాపులకనపర్తి జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం కోసం శనివారం నూతన ఏజెన్సీని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సత్య శారద పాఠశాలను తనిఖీ చేసి ఏజెన్సీని తొలగించాలని ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో శనివారం నూతన ఏజెన్సీని ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంతవో రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేరిణి నృత్య కళాకారులకు సన్మానం

రంజిత్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న పురోహితులు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 26: అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తొలిసారిగా పేరిణి నృత్య రూపకాన్ని ప్రదర్శించిన పేరిణి నృత్య కళాకారులు గజ్జెల రంజిత్‌కుమార్, నవ్యజ దంపతులను సన్మానించారు. శనివారం దేశాయిపేటరోడ్డులోని కార్యాలయంలో జిల్లా పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల ఓంకారలింగంశాస్త్రి ఆధ్వర్యంలో రంజిత్‌కుమార్ దంపతులను సత్కరించారు. పూర్వం సైన్యం యుద్ధంలో పాల్గొనేందుకు భయపడిన సందర్భాల్లో వారిలో నూతనోత్తేజం నింపేందుకు పేరిణి నృత్యాన్ని ప్రదర్శించారని గుర్తుచేశారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో పేరిణి నృత్యం ప్రశంసలు అందుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందన్నారు. కార్యక్రమంలో గజ్జెల రాజ్‌కుమార్, పెద్దూరి శ్రీనివాసస్వామి, కుసుమ రామకృష్ణశాస్త్రి, రాచర్ల రాజుశాస్త్రి పాల్గొన్నారు. అలాగే, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 192 గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రంజిత్‌కుమార్-నవ్యజ దంపతులను ఘనంగా సత్కరించారు. రామన్నపేట డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ వారిని సత్కరించారు.

## 'ఆ స్థలాన్ని పండ్ల మార్కెట్‌కు కేటాయించాలి'

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

కాశీబుగ్గ, అక్టోబర్ 26: లక్ష్మీపురంలోని పాత కూరగాయల మార్కెట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ స్థలాలను పండ్ల మార్కెట్‌కు కేటాయించాలని ఫ్రూట్స్ మర్చంట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు.

**కమ్యూనిటీ హాల్ నిర్మించాలి**

నగరంలోని పాత సీసీఎస్ స్థలంలో బీసీ కమ్యూనిటీ హాల్, మహిళా భవనం నిర్మించేందుకు రూ. 3 కోట్ల నిధులు మంజూరు అయినా పనులు జరగడం లేదని స్థానికులు అన్నారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కలెక్టర్, కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు గుర్తుచేశారు. స్థానికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**కార్డెన్ సెర్చ్‌లో ఏసీపీ తిరుపతి**

మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ తిరుపతి

కాశీబుగ్గ, అక్టోబర్ 26: వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లిలో శనివారం రాత్రి ఎనుమాముల పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన రూ. 10 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మామునూరు ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనుమానితులు ఉన్నా, ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ అల్లె రాఘవేందర్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సైలు పోగుల శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

## 'ఎండోమెంట్‌కు అప్పగించడం సరికాదు'

ఆర్థిక సాయం అందజేస్తున్న ఈగ మల్లేశం

కాశీబుగ్గ, అక్టోబర్ 26: కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వర, రంగనాథస్వామి ఆలయాలను ప్రభుత్వం ఎండోమెంట్‌కు అప్పగిండం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసర విజయచందర్‌రెడ్డి, సముద్రాల పరమేశ్వర్లు అన్నారు. శనివారం ఆలయ సమీపంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హిందువుల మనోభావాలు దెబ్బతీయడానికే కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నిందని వారు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, గడల కుమార్‌యాదవ్, పైర్ధ ఆనంద్, ఎరుకల రఘుణారెడ్డి, కోమాకుల నాగరాజు, పత్రి సుభాష్, పైర్ధ సంజన్, బొడ్డు రాకేశ్, మునగాల సతీశ్, సిద్దోజు శ్రీనివాస్, బైరి మురళీకృష్ణ, కోట సతీశ్, గుర్రపు సత్యనారాయణ, గోవిందర్‌సింగ్, ముచ్చర్ల ప్రభాకరాచారి, అల్లి అజయ్, సొల్లేటి రాఘవ, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలి

నల్లబెల్లి, అక్టోబర్ 26: ఆంక్షలు లేకుండా భూమి రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నాయకులు శనివారం నిరసన తెలిపారు. దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడుతూ కోర్టు ఆదేశాలు మినహా స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి రైతుకూ నిబంధనల మేరకు భూముల రిజిస్ట్రేషన్లు చేసేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బొట్ల నరేశ్, ఒల్లె పర్వతాలు, ఓదెల రవి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

వర్ధన్నపేట, అక్టోబర్ 26: పట్టణానికి చెందిన బొమ్మగాని సారంగపాణి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, ఖాదీబోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం పార్టీ శ్రేణులతో కలిసి సారంగపాణి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, ఇటీవల బరిగెల కొమ్మాలు, పూజారి శ్రీనివాస్ తల్లి లక్ష్మి మృతి చెందగా, ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సోమేశ్వర్‌రావు, సుధాకర్, రాజు, సురేశ్, ఏకాంతం, సారయ్య, శ్రీనివాస్, సంపత్‌రావు, గోపి పాల్గొన్నారు.

## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

నర్సంపేట, అక్టోబర్ 26: నర్సంపేటలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. అయ్యప్ప ఆలయం సమీపంలోని షెడ్‌లో పేకాడుతున్న పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని పేకాడుతున్న గొడిశాల కాంతయ్య, ఆంగోత్ వెంకన్న, బత్తుల కుమార్, దండు వేణును పట్టుకున్నారు. వారి నుంచి ప్లేకార్డ్స్, రూ. 3560 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలి

వరంగల్‌చౌరస్తా, అక్టోబర్ 26: లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. 27వ డివిజన్ పరిధిలోని తెలంగాణ రైతు భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుమారు అర్ధ శతాబ్ద కాలంగా వ్యాపార లావాదేవీలు పెరిగినా, మార్కెట్ కార్యాలయానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పండ్ల మార్కెట్‌పై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. మార్కెట్ లావాదేవీలకు రైతులు, ట్రేడర్స్ ఇబ్బంది పడుతున్నారన్నారు. హైదరాబాద్ గడ్డిఅన్నారం మార్కెట్ తర్వాత రెండో అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా గుర్తింపు పొందిన వరంగల్‌పై అధికారులు చిన్నచూపు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రూ. 14 కోట్ల వ్యయంతో ప్రారంభించిన పనులు రెండేళ్లు అయినా పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం నిర్మాణ వ్యయం సుమారు రూ. 45 కోట్లకు చేరిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని కోరారు. రైతు సంఘం కార్యదర్శి ఓదెల రాజయ్య, ఊరటి అంశాల్‌రెడ్డి, అయితం నగేశ్, బొల్లు ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి : కమిషనర్

పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కాశీబుగ్గ, అక్టోబర్ 26: లక్ష్మీపురంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్(ఐవీఎన్ఏం) నిర్మాణ పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి లక్ష్మీపురంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులను అడిగి పనుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, కార్యదర్శి పోలెపాక నిర్మల, ఈఈ శ్రీనివాస్, డీఈ రాజ్‌కుమార్, పండ్ల వ్యాపారులు వెల్ది సాంబయ్య, దొంగల చెన్న మల్లు యాదవ్, వెల్ది సతీశ్ పాల్గొన్నారు.

## 'మెడికవర్'లో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

న్యూశాయంపేట, అక్టోబర్ 26 : హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో మొదటిసారిగా అత్యంత క్లిష్టమైన తవి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు శరత్‌రెడ్డి వెల్లడించారు. శనివారం హాస్పిటల్లో ఆయన మాట్లాడుతూ.. కాజీపేట సిద్ధార్థ నగర్‌కు చెందిన 77 ఏళ్ల విద్యాసాగర్ కార్డియాక్ సింకోపితో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు శరత్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, సృజన్, అవనీష్ ఆధునిక పద్ధతుల్లో పీటీసీఏ, తవి రెండు ప్రొసీజర్స్‌ను ఒకేసారి విజయవంతంగా చేశామన్నారు. రోగి 45 రోజుల్లో సాధారణ స